

మాట్లాడుతున్న గ్రంథాలయ వికారాబాద్ జిల్లా మాజీ చైర్మన్ రాజుగౌడ్

రైతు సమస్యలపై బీఆర్ఎస్ రైతు దీక్ష

యాలాల, ఏప్రిల్ 6 : రైతు సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పోరుబాట పట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల అనుసరిస్తున్న ఉదాసీన వైఖరికి నిరసనగా జంగ్ సైరన్ మోగించింది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపు మేరకు నైతన్నలకు మద్దతుగా రైతు దీక్షల్లో పార్టీ శ్రేణులు అన్నదాతకు అండగా మేమున్నామంటూ రైతులకు భరోసా కల్పించారు. యాలాల మండల పరిధిలోని లక్ష్మీనారాయణపూర్ చౌరస్తాపై శనివారం పార్టీ కార్యకర్తలు రైతు దీక్ష నిర్వహించారు. గ్రంథాలయ వికారాబాద్ జిల్లా మాజీ చైర్మన్ రాజుగౌడ్ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ సాగునీరు అందక, కరెంటు లేక లక్షలాది ఎకరాల్లో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పంట ఎండిపోయిన రైతులకు ఎకరానికి రూ.25వేలు ఇవ్వాలని, వరి, మక్కలకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వాలని, రైతులకు వెంటనే రూ.2 లక్షల ఋణమాఫీ చేయాలని, రైతు భరోసా కింద ఎకరానికి రూ.15 వేలు ఇవ్వాలన్నారు. ఎన్నికల హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువన్నారు. సాగునీరు అందక వేల ఎకరాల్లో పంట ఎండిపోయి రైతులు అరిగోస పడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 4 నెలలు అవుతున్నా హామీలను అమలు చేయకపోగా, రైతులను ఇష్టారీతిగా అవమానాలకు గురిచేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

మహనీయుల స్ఫూర్తితో సామాజిక పోరాటాలు

పరిగి, ఏప్రిల్ 6: మహనీయుల స్ఫూర్తితో సామాజిక పోరాటాలు కొనసాగిస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ పేర్కొన్నారు. శనివారం సీఐటీయూ వ్యవస్థాపకుడు బీటీ రణధీవే వర్ధంతి సందర్భంగా పరిగిలో ఆయన చిత్రపటానికి రామకృష్ణతో పాటు పలువురు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీటీ రణధీవే కార్మికులకు కనీస వేతనాలు, ఈఎస్ఐ, పీఎఫ్, ఉద్యోగ భద్రత కోసం పోరాటాలు చేశారన్నారు. నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం బడా పెట్టుబడిదారులకు రాయితీలిస్తూ పేదలపై భారం మోపుతుందన్నారు. సమస్యలపై ఈనెల 6 నుంచి 14వ తేదీ వరకు మహనీయుల స్ఫూర్తితో పోరాటాలు చేయాలని నిర్ణయించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.నర్సమ్మ, భారతి, సంతోష, సునీత, ఇందిర, ఈసాబీ, అంబాబాయి, మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

తాండూరు రూరల్, ఏప్రిల్ 6: వేసవిలో తాగునీటి సమస్యలేకుండా చూడాల్సిన బాధ్యత క్షేత్రస్థాయిలోని అధికారులదని తాండూరు మండల ప్రత్యేకాధికారి ఎంఎ సత్తార్ అన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల తోపాటు ఏఈలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మంచినీటి సమస్య లేకుండా చూడాలన్నారు. అదేవిధంగా హరితహారం మొక్కల పెంపకంపై దృష్టి సారించాలని సూచించారు. నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా చూసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో విశ్వప్రసాద్, ఎంపీఈవో రతన్‌సింగ్ ఉన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలి

సిబ్బందితో సమావేశమైన బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ, ఏప్రిల్ 6: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజలకు మంచినీటి ఎద్దడి రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని జలమండలి లైన్‌మెన్లను బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర ఆదేశించారు. శనివారం ఆయన కార్పొరేషన్ కార్యాలయంలో వివిధ విభాగాల సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. కార్పొరేషన్ పరిధిలో భూ గర్భ జాలలు అడుగంటడంతో నీటి ఇబ్బందులు తప్పడం లేదని అన్నారు. జలమండలి అధికారులు స్పందించి నీటి సరఫరాను పెంచి ప్రజలకు తాగునీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం 2024-2025 ఆర్థిక సంవత్సరానికి ఆస్తిపన్నులో 5శాతం రాయితీని చెల్లింపుదారులకు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాలని బిల్ కలెక్టర్లకు ఆయన సూచించారు. కార్యక్రమంలో డీఈఈ యాదయ్య, ఏఈ రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మట్టి కుప్పలు ఎత్తరు.. రోడ్డు వెయ్యరు..

కొండాపూర్ డివిజన్ ప్రేమ్‌నగర్ బీ-బ్లాక్ 40 ఫీట్ల రోడ్డు అధ్వానంగా మారింది. రోడ్డుపై పేరుకుపోయిన మట్టికుప్పలు, ఇష్టానుసారంగా పారవేస్తున్న చెత్త, చెదారాలతో వాహనదారులతోపాటు స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు పేర్కొన్నారు. రోడ్డు సమస్యకు పరిష్కారాన్ని చూపాలంటూ ప్రజలు అధికారులను కోరుతున్నారు. - *కొండాపూర్, ఏప్రిల్ 6*

పాఠశాలల అభివృద్ధికి ప్రణాళికలు

ఎంఈవో రాంరెడ్డి
పలు స్కూల్ కమిటీలతో అధికారుల సమావేశం
మౌలిక వసతుల కల్పనపై చర్చ

కమిటీ సభ్యులకు వివరిస్తున్న ఎంపీడీవో, జీహెచ్ఎం

కొడంగల్ : పాఠశాలల అభివృద్ధికి సంబంధించి అమ్మా ఆదర్శ కమిటీ ఆధ్వర్యంలో ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంఈవో రాంరెడ్డి ఉపాధ్యాయులుకు సూచించారు. శనివారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఉపాధ్యాయులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి పాఠశాలలో నెలకొన్న మరమ్మతులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పాఠశాల తరగతి గదుల్లో కిటికీలు, కరెంటు, తాగునీటి వంటి పలు అంశాలకు సంబంధించి కమిటీ ఆధ్వర్యంలో రూ.25వేల వరకు ఖర్చు చేసుకునే అవకాశం ఉందన్నారు. రూ.25వేల బడ్జెట్ దాటితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని వెల్లడించారు. ప్రస్తుతం పాఠశాలల్లో నెలకొన్న అత్యవసర సౌకర్యాలను గుర్తించి జాబితా సిబ్బంది చేయాలని సూచించారు. జాబితా మేరకు ఖాతాల్లో నిధులు జమ కాగానే పనులు చేపట్టుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఉషక్క, మున్సిపల్ కమిషన్ బలరాంనాయక్, కార్యక్రమ ప్రత్యేకాధికారి సత్యనారాయణతో పాటు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధిపై దృష్టి సారించాలి

పూడూరు : ప్రభుత్వ పాఠశాలల్లోని మౌలిక వసతులపై నూతన పాఠశాల కమిటీ చైర్మన్లు దృష్టి సారించాలని ఎంపీడీవో పాండు, మండల విద్యాధికారి హరిశ్చంద్ర తెలిపారు. శనివారం పూడూరు మండల కేంద్రంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలల్లో పాఠశాల గదుల మరమ్మతులు, తాగునీటి, మరుగుదొడ్లు, విద్యుత్ వంటి సదుపాయాలకు నిధులు మంజూరు చేస్తుందన్నారు. ఈ నిధుల ద్వారా పాఠశాల చైర్మన్లు, ప్రధానోపాధ్యాయులు కలిసి త్వరగా పనులు చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సుధారాణి, ఏపీఎం బందయ్య, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సుజాత, కాంప్లెక్స్ హెచ్ఎం రత్న, చంద్రశేఖర్, ఎంఎన్‌వో వెంకటేశం, సీఆర్‌పీలు జంగయ్య, గాలయ్య, ఎంఆర్‌సీ రాఘవేందర్ పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ కమిటీలతో సమావేశం

బొంరాస్‌పేట : ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలతో శనివారం మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. కమిటీలు చేయవలసిన పనుల గురించి ఈ సమావేశంలో ఎంపీడీవో శ్రీదేవి, జీహెచ్ఎం హరిలాల్ వివరించారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం వీటిని ఏర్పాటు చేసిందని కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం పాఠశాలల్లో ఎలాంటి అవసరాలు ఉన్నాయో వాటికి తీర్మానాలు సేకరించారు. అనంతరం ఎంపీడీవో శ్రీదేవి మాట్లాడుతూ వచ్చే లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా పోలింగ్ కేంద్రాలు ఉన్న పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు ఉండే విధంగా ఉపాధ్యాయులు చూసుకోవాలని సూచించారు. సమావేశంలో డీటీ రవికుమార్, పాఠశాలల హెచ్ఎంలు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్లు పాల్గొన్నారు.

కులకచర్ల : పాఠశాలల అభివృద్ధికి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు పనిచేయాలని కులకచర్ల ఎంపీడీవో రామకృష్ణ నాయక్ తెలిపారు. శనివారం కులకచర్ల మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గ్రామ సంఘం అధ్యక్షులతో కలిసి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేసి వారి పేర ఖాతాలు కూడా ప్రారంభించినట్లు చెప్పారు. పాఠశాలలు ప్రారంభించే వరకు ప్రతి పాఠశాలలో మౌలిక వసతులను కల్పించేందుకు కమిటీ సభ్యులు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో కులకచర్ల మండల ప్రత్యేక అధికారి సరళదేవి, ఎంఈవో అబీబ్‌హైమద్, ఏపీఎం శోభ, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గ్రామ సంఘాల అధ్యక్షులు, అధికారులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీల్లో
నగదు పట్టివేత

నగదును చూపిస్తున్న ఎస్ఐ

పెద్దేముల్, ఏప్రిల్ 6 : రెండు వేర్వేరు ఘటనల్లో ఇద్దరి నుంచి రెండు వాహనాల్లో తరలిస్తున్న రూ.2 లక్షల 20వేలను పట్టుకున్నట్లు పెద్దేముల్ ఎస్ఐ కె.గిరి తెలిపారు. మండల కేంద్రం సమీపంలో వాహనాలను సిబ్బందితో కలిసి తనిఖీ చేస్తుండగా, పెద్దేముల్ నుంచి జనగాం గ్రామానికి వెళ్తున్న సమయంలో వాహనాన్ని తనిఖీ చేయగా ఒకరి వద్ద రూ. లక్షా20 వేలు ఉన్నట్లు గుర్తించి అట్టి వివరాలను తెలుసుకోగా పుల్లమొల్ల శ్రీనివాస్‌కు చెందినవిగా పేర్కొన్నారు. అతడి వద్ద ఎలాంటి అనుమతి పత్రాలు లేనందున ఆ డబ్బును సీజ్ చేసినట్లు తెలిపారు. మరో ఘటనలో పెద్దేముల గ్రామ సమీపంలో సిబ్బందితో కలిసి తనిఖీ చేయగా గాజీపూర్ గ్రామానికి చెందిన డి.కృష్ణ వద్ద లక్ష రూపాయలను పట్టుకున్నట్లు వివరించారు. అనుమతి పత్రాలు లేనందునా ఆ డబ్బును సీజ్ చేయడం జరిగిందని ఎస్ఐ కె.గిరి తెలిపారు. మొత్తంగా రెండు వేర్వేరు ఘటనల్లో రూ.2 లక్షల 20వేలను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పిస్తున్న ఏఎస్సై చారి

బాధ్యతగా వాహనాలు నడుపాలి

దోమ, ఏప్రిల్ 6 : బాధ్యతతో వాహనాలు నడుపాలని ఏఎస్సై చారి అన్నారు. శనివారం దోమ మండల కేంద్రంలోని హనుమాన్ కూడలిలో ఏఎస్సై చారి పోలీసు సిబ్బందితో కలిసి వాహనదారులు, ప్రజలకు రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన కల్పించారు. ప్రతివాహనదారుడు హెల్మెట్ ధరించాలని, కారు నడిపే వారు విధిగా సీటు బెల్టు వేసుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వాహనదారులు, ప్రజలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వడగాలులపై అప్రమత్తంగా ఉండాలి

విద్యార్థులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న హెచ్ఎం, ఆశ కార్యకర్త

బొంరాస్‌పేట, ఏప్రిల్ 6 : వడగాలుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని బాపల్లితండా ప్రాథమిక పాఠశాల హెచ్ఎం గోపాల్ సూచించారు. అధికంగా నమోదవుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా శనివారం పాఠశాలలో విద్యార్థులకు ఆయన వడగాలులు, ఎండల వల్ల కలిగే దుష్ఫలితాల గురించి వివరించారు. విద్యార్థులు ఎండలో తిరగరాదని, డీహైడ్రేషన్‌కు గురికాకుండా ఎక్కువగా నీళ్లు తాగాలని సూచించారు. ఆశా కార్యకర్త కరుణావతి విద్యార్థులకు మాత్రలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేశారు.

యువతి ఆత్మహత్య
మన్సాన్‌పల్లి గ్రామంలో ఘటన

పెద్దేముల్, ఏప్రిల్ 6 : కడుపు నొప్పి భరించలేక ఓ యువతి ఉరివేసుకుని మరణించిన ఘటన శనివారం పెద్దేముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మన్‌సాన్‌పల్లి గ్రామంలో జరిగింది. ఎస్ఐ కె.గిరి తెలిపిన వివరాల ప్రకారం....మన్‌సాన్‌పల్లి గ్రామానికి చెందిన విస్లావత్ లక్ష్మణ్‌కు మొత్తం నలుగురు ఆడ సంతానం ఉన్నారు. అందులో విస్లావత్ అంజు ఇంటర్మీడియట్ చదువు పూర్తిచేసి ఇంటి వద్దనే ఉంటుంది. గత కొద్ది రోజుల నుంచి అంజు కడుపు నొప్పితో బాధపడుతున్నది. ఈ విషయమై తన తల్లిదండ్రులకు తరుచూ చెబుతూ బాధపడుతూ వచ్చేది. శనివారం రాత్రి ఆమె కుటుంబ సభ్యులతో పాటు అంజు భోజనం చేసి తన రూమ్‌లోకి వెళ్లి పడుకుంది. ఉదయం తన తల్లి సీతాబాయ్ తన కూతురిని నిద్రలేపుదామని తలుపు కొట్టగా, ఎంతకీ తీయకపోవడంతో తన భర్తకు ఈ విషయాన్ని చెప్పింది. దాంతో భర్త లక్ష్మణ్ కిటికీలోంచి చూడగా అంజు తన రూమ్‌లో ఉన్న ఫ్యాన్‌కు ఉరివేసుకొని మరణించింది. తండ్రి లక్ష్మణ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పదంగా మహిళ మృతి

యాలాల, ఏప్రిల్ 6 : అనుమానాస్పదంగా మహిళ మృతి చెందిన ఘటన తాండూరు పట్టణంలో శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపేట జిల్లా కోస్గీ మండలం గుండిమల్ గ్రామానికి చెందిన తిరుపతమ్మ(37) భర్త లేక పోవడంతో తల్లిగారి వద్ద ఉంటుంది. తాండూరు పట్టణం సాయిపూర్‌లోని అక్క వద్ద ఉంటూ ఓ ఇంట్లో పని మనిషిగా చేరింది. రోజు మాదిరిగా శుక్రవారం పనికి వెళ్లి రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారి ఇండ్లలో వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. శనివారం తాండూరు పోలీస్‌స్టేషన్ సమీపంలోని రాయల్ కాంట వద్ద నిర్మానుష్య ప్రదేశంలో మహిళ మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలంలో ఉన్న మృతదేహం తిరుపతమ్మదిగా మృతిరాలి అక్క గుర్తించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాండూరు జిల్లా దవాఖానకు తరలించారు. మహిళ హత్యపై పోలీసులు ముమ్మర దర్యాప్తు చేపడుతున్నారు.

ఓటు హక్కు ప్రాముఖ్యతపై అవగాహన

మణికొండలో మున్సిపల్ కార్మికులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న స్వీప్ నోడల్ ఆఫీసర్, బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర

మణికొండ, ఏప్రిల్ 6: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ప్రాముఖ్యాన్ని ప్రతిఒక్కరూ తెలుసుకొని, ఉపయోగించుకోవాలని స్వీప్ నోడల్ ఆఫీసర్, బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. శనివారం మణికొండ మున్సిపల్ కార్యాలయం నుంచి గోల్డెన్ టెంపుల్ వరకు ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ.. మానవహారం చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఓటు అనే ఆయుధాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వందశాతం ఉపయోగించుకునేలా అవగాహన చేపడుతున్నామన్నారు. ఈ సందర్భంగా ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏఈ సాయిమౌనిక, ఈఈ సంపత్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీలో పాల్గొన్న అధికారులు, కార్మికులు

బాలికపై లైంగికదాడి

తాండూరు రూరల్, ఏప్రిల్ 6 : బాలికపై ఓ వ్యక్తి లైంగికదాడికి పాల్పడిన ఘటన కరణ్‌కోట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై విఠల్‌రెడ్డి కథనం ప్రకారం... తాండూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన 17 ఏండ్ల బాలికపై ఐనెల్లి గ్రామానికి చెందిన బూడిద అంబేష్ ఈ నెల 4వ తేదీన లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ నెల 4వ తేదీన పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో తన స్నేహితురాలి పెండ్లికి వెళ్లింది. ఈ విషయం తెలుసుకున్న అంబేష్ ఉద్దేశపూర్వకంగా ఆ పెండ్లికి వెళ్లాడు. అమ్మాయితో మీ ఇంటి వద్ద తాను ఆటోలో దించుతానని నమ్మించాడు. ఐనెల్లి గ్రామ శివారులోని పొలంలోకి అమ్మాయిని బలవంతంగా తీసుకెళ్లి లైంగికదాడి చేశాడు. ఈ విషయం ఎక్కడైనా చెబితే చంపుతానని బెదిరించి, ఆ రోజు తన ఇంట్లోనే ఉంచుకొన్నాడు. ఈ నెల 5వ తేదీ ఉదయం తాండూరులోని రైల్వేస్టేషన్‌లో ట్రైన్ ఎక్కించి పంపించాడు. బాలిక అమ్మమ్మకు జరిగిన విషయం తెలిపింది. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు అంబేష్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ఈ-వేస్టేజీ సేకరణపై అవగాహన

ఈ వేస్టేజీ నిర్వహణపై ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మ బండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్పెజ్సీ అనే సంస్థ ఆధ్వర్యంలో శనివవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. పర్యావరణానికి ముప్పును కల్పించే ఈ వేస్టేజీ నిర్వహణకు ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని నిర్వహకులు సూచించారు. అధునాతన ఎలక్ట్రానిక్ పరికరాల పేరిట నానాటికీ ఈ వేస్టేజీ పేరుకుపోతున్నదని, దానిని నియంత్రించకపోతో భవిష్యత్‌లో అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. వీటిని సేకరించి పునర్వియోగించాలని శ్రీవాణి, మానసవీణలు వివరించారు. ఈ కార్యక్రమంలో పవన్‌రాజ్, శ్రీకాంత్, శ్రీవాణి, ప్రియాంక, శ్రీనివాస్, మోహన్‌రావు,అనంతయ్య, ప్రేమ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.
- మియాపూర్, ఏప్రిల్ 6

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-311821-All
★Wanted Agents, Associates Franchise throughout Telangana for Abroad Medical College Admission. 8881116865 / 8881115253.
NT-311882-All
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్రెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శనలు

మాదాపూర్‌లోని శిల్పారామంలో పలువురి కళాకారుల నృత్య ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ప్రదర్శనల్లో శనివారం గురుకులం అకాడమీలో కూచిపూడి నాట్య గురువులు కళాజ్యోతి, కళా నంది పురస్కార గ్రహీత పొపురి లక్ష్మీ తులసి శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. వినాయక కౌతం, జయము జయము, సాధించవే మనసా, తక్కువేమి మనకు, చిదంబరేశ్వర నటరాజ, శివ తాండవం, జతిస్వరం, మరకత మణిమయ అంశాలను వేద, సత్య, కృతి, అనన్య, ఆద్య, అలేఖ్య, శ్రీభవ్య, శ్రీవర్షిణిలు నర్తించిన తీరు ఆద్యాంతం ఆకట్టుకున్నది.
- కొండాపూర్, ఏప్రిల్ 6

రోడ్డు విస్తరణలో భూమి కోల్పోతున్నం.. న్యాయం చేయండి

శంషాబాద్ తహసీల్దార్ నాగమణికి వినతిపత్రం అందజేస్తున్న చౌదర్‌గూడ రైతులు

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 6: రోడ్డు విస్తరణలో భూమిని కోల్పోతున్నం.. తమకు న్యాయం చేయాలని కోరుతూ శనివారం చౌదర్‌గూడ రైతులు మన్నె జాన్‌వెస్లి, మన్నె మనోహర్, మన్నె సంజీవరావు, మన్నె రూఫస్ శంషాబాద్ తహసీల్దార్ నాగమణికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. చౌదర్‌గూడలోని తమ భూమి సర్వే నంబర్ 213లో 5.23 గుంటల భూమి ఉందని అన్నారు. చౌదర్‌గూడ-పెద్దషాపూర్ మధ్య గతంలో ఉన్న రోడ్డు కాకుండా 33పీట్లకు నిర్మాణం చేపడుతున్నారని చెప్పారు. అయితే రోడ్డుకు ఇరువైపుల ఉన్న భూములు తీసుకోవాల్సిన కాంట్రాక్టర్.. తమ భూమిలో నుంచి స్థలాన్ని తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు ఉన్న భూమిని ఎందుకు తీసుకోవడంలేదని వారు ప్రశ్నించారు. పాత హద్దురాళ్లను కాదని గత శుక్రవారం సర్వేయర్ కొత్త హద్దురాళ్ల ఏర్పాటు చేశారని తెలిపారు. దీంతో తమకు తీవ్రనష్టం జరుగుతుందని తెలిపారు. తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి తాండూర్/కొడంగల్ } 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962